క్లుప్తంగా

గోదాదేవి పూజలు



అలంకరణలో గోదాదేవి

నింద్ర: మండల కేంద్రమైన నింద్రలో వినాయక ఆలయంలో మంగళవారం గోదాదేవి పూజలు ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు చేపట్టారు. సాయంత్రం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఉత్సవ మూర్తిని పురవీధుల్లో ఘనంగా ఊరేగించారు.

నేడు వైఎస్సార్‌సీపీ సమావేశం

వెదురుకుప్పం: వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశాన్ని బుధవారం ఉదయం 10.30 గంటలకు వెదురుకుప్పంలో నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు కామసాని పద్మనాభరెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జన్మదిన వేడుకల నిర్వహణకు సంబంధించి చర్చించనున్నట్లు చెప్పారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరుకావాలని కోరారు.

నిరుపేదలకు వరంలా ఫ్యామిలీ డాక్టర్



వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ గౌరి

శ్రీరంగరాజపురం: ప్రభుత్వం అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిరుపేదలకు వరంలా మారిందని మండల వైద్యాధికారి డాక్టర్ గౌరి అన్నారు. మంగళవారం ఆయన తయ్యూరు సచివాలయ పరిధి ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శిబిరంలో పాల్గొన్న 47 మందికి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గర్భిణులు, చిన్న పిల్లలు మంచి పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. అనంతరం ఇళ్ల వద్దకు వెళ్లి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకుని బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పలు ఆరోగ్య సూచనలు చేశారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమతత్తంగా ఉండాలని అవగాహన కల్పించారు. జ్వరం, జలుబు, ఆయాసం, దగ్గు వస్తే వెంటనే స్థానిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి డాక్టర్‌ను సంప్రదించాలన్నారు.

22న రక్తదాన శిబిరం

నగరి : స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ఈ నెల 22వ తేదీన లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు నగరి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఎ.మోహన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రక్తదానం పలువురి ప్రాణాలను కాపాడుతుందని ఆసక్తి గల వారు ఈ రక్తదాన శిబిరంలో పాల్గొనాలన్నారు.

వైభవంగా పిండి దీపం



పిండి దీపం తెస్తున్న గోవిందభక్తులు

నగరి : పట్టణ పరిధిలోని గోవింద మాల భక్త బృందం వారు 29వ సంవత్సరపు పిండి దీపం కార్యక్రమాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం వద్ద గల ఆంజనేయ స్వామి ఆలయం వద్ద నుంచి పిండి దీపం వెలిగించుకుని గోవిందనామం జపం చేస్తూ మంగళవాయిద్యాలతో కరియమాణిక్య స్వామి ఆలయానికి ఊరేగింపుగా తీసుకువచ్చారు. ఈ సందర్భంగా భక్తులు నాట్యం చేస్తూ గోవింద భజనలు చేసుకుంటూ వచ్చారు. పట్టణ ప్రజలు ఊరేగింపుగా వచ్చిన పిండి దీపాన్ని మొక్కుకున్నారు. ఆలయం చేరిన అనంతరం దీపం పెట్టిన పిండి కోసం భక్తులు పోటీలు పడ్డారు. నిర్వాహకులు అందజేసిన పిండిని గోవిందభక్తులు ప్రసాదంగా తీసుకెళ్లారు.

ఉపాధి అవకాశాలపై అవగాహన



మాట్లాడుతున్న వ్యక్తిత్వ వికాస నిపుణులు

పుత్తూరు: ప్రతి ఒక్కరూ విద్యార్థి దశలో మంచి అలవాట్లను అలవర్చుకోవడంతో పాటు ఉపాధి అవకాశాలపై అవగాహన కలిగి ఉండాలని సెట్విన్ మేనేజర్ మోహన్‌కుమార్ సూచించారు. మంగళవారం స్థానిక ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వ్యక్తిత్వ వికాసంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రతి విద్యార్థి తమకు ఆసక్తి గల రంగాలపై నైపుణ్యం పెంచుకోవడానికి నిరంతరం కృషి చేయాలని చెప్పారు. ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు నివేదితారెడ్డి మాట్లాడుతూ వ్యక్తిత్వ వికాస కౌశలాలను తెలియజేశారు. దేశంలో ఉద్యోగ అవకాశాలకు కొదవ లేదని, అయితే నైపుణ్యం గల అభ్యర్థుల కొరత ఉందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసులురెడ్డి, కామర్స్ విభాగాధిపతి డాక్టర్ ఎ.దేవకి, అధ్యాపకులు పాల్గొన్నారు.

అభివృద్ధికి ఆధార్.. జగనన్న సర్కార్

- టీడీపీ నేతలు ప్రాతినిధ్యం వహిస్తున్న వార్డుల్లోనూ అభివృద్ధి పనులు చేస్తున్నాం
- మంత్రి ఆర్‌కే రోజా
- రూ.80 లక్షల నిధులతో సిమెంటురోడ్లు, మురుగుకాల్వ నిర్మాణానికి భూమిపూజ
- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమ సమస్యలకు పరిష్కారం



చుడీదార్ తయారీని పరిశీలిస్తున్న మంత్రి రోజా



కేవీపీఆర్ పేటలో సిమెంటు రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న మంత్రి రోజా

నగరి : అభివృద్ధికి ఆధార్.. జగనన్న సర్కార్ అని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజనసర్వీసుల క్రీడాశాఖ మంత్రి ఆర్‌కే రోజా అన్నారు. మంగళవారం ఆమె మున్సిపల్ పరిధిలోని రామ్‌నగర్–సీ, ఇందిరానగర్‌లో రూ.40 లక్షల వ్యయంతో నిర్మించనున్న సిమెంటు రోడ్డు, డ్రైనేజీ పనులకు భూమిపూజ చేశారు. కేవీపీఆర్‌పేటలో రెండు వార్డుల్లో రూ.40 లక్షల వ్యయంతో నిర్మించే సిమెంటు రోడ్డు పనులను ప్రారంభించారు. త్వరగా రోడ్డు, కాలువ పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు తన దృష్టికి తీసుకువచ్చిన రోడ్డు, మురుగు కాలువల సమస్యను పరిష్కరించడం జరుగుతోందన్నారు. ప్రతి గడపకు వెళ్లి సంక్షేమం అందిందా, ఏవైనా సమస్యలున్నాయా ? అని తెలుసుకుని ప్రజలకు అవసరమైన, వారు సూచించే పనులకే ప్రాధాన్యత ఇస్తూ అభివృద్ధి పనులు చేస్తున్న ఏకైక ప్రభుత్వం తమదే అన్నారు.

టీడీపీ వార్డుల్లో ఇప్పుడే అభివృద్ధి..

మున్సిపల్ పరిధిలోని కేవీపీఆర్ పేటలో రెండు దఫాలుగా టీడీపీనే గెలుపొందిన వార్డుల్లో గతంలో ఎలాంటి అభివృద్ధి పనులు జరగలేదని ఇప్పుడే అభివృద్ధి పనులు జరుగుతున్నాయని మంత్రి ఆర్కే రోజా అన్నారు. ఈ వార్డులోనే రూ.20 లక్షల వ్యయంతో రోడ్లు వేస్తున్నామని, నాడు నేడు పథకంలో రూ.94 లక్షల అంచనా వ్యయంతో పాఠశాలలను ఆధునీకరించడం జరిగిందని, సంక్షేమ పథకాలు అందిస్తున్నామని తెలిపారు. జగనన్న పాలనలో పార్టీలకు అతీతంగా మేలు జరుగుతుందనడానికి ఇవే సాక్ష్యమన్నారు. నియోజకవర్గానికి తొలి మహిళా ఎమ్మెల్యేగా, తొలి మహిళా మంత్రిగా గుర్తింపు పొంది నేడు ప్రజలకు సేవ చేస్తున్నానంటే అది నగరి ప్రజల ఆశీస్సులే అని అన్నారు. ప్రజల ఆశీస్సులతో 2024లో తనకు హ్యాట్రిక్ విజయాన్ని అందించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, వైస్‌చైర్మన్ బాలన్, కౌన్సిలర్లు బిలాల్, గంగాధరం, మురుగ, మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ బాలకృష్ణ, కోఆప్షన్ సభ్యులు హమీద్, ఎల్లప్పరెడ్డి, డీఈ నరేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మంచి డిజైన్లకు పేరు.. నగరి చుడీదారు

మంచి డిజైన్లకు పేరు.. నగరిలో తయారయ్యే చుడీదార్ అని మంత్రి ఆర్‌కే రోజా అన్నారు. మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా చుడీదార్ల నేతను ఆమె పరిశీలించారు. మరమగ్గాల ద్వారా అబ్బుర పరిచే డిజైన్లు, రంగులతో తయారవుతున్న చుడీదార్లు మంత్రిని ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగరి నేతన్నల్లో ఎంతో నైపుణ్యం దాగుందన్నారు. వారు నేసే వస్త్రాల డిజైన్లు, అందుకు వారే నూలు రంగులు వారి ప్రతిభకు అద్దం పడుతోందన్నారు. ఆకర్షణీయంగా, అబ్బురపరిచే విధంగా దుస్తులు తయారు చేస్తున్నారని నగరి చుడీదారు, మంచి డిజైన్లకు పేరని కొనియాడారు.

కార్వేటినగరంలో జాతర కోలాహలం



ప్రత్యేక అలంకరణలో శ్రీబంగారమ్మ



అలరించిన వేషధారణలు

కార్వేటినగరం: మండలకేంద్రం కార్వేటినగరంలో గ్రామదేవత శ్రీబంగారమ్మ జాతర కోలాహలంగా జరుగుతోంది. ఈ సందర్భంగా మంగళవారం అమ్మవారి ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఎటు చూసినా భక్తుల సందడి నెలకొంది. యువత వివిధ వేషధారణలు ధరించారు. బంగారమ్మ, నడివీధి గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆలయం వద్ద మహిళలు పొంగళ్లు వండి పిండిదీపాలతో నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే అంబలిని భక్తులకు పంచిపెట్టారు. మహిళా భక్తులు తడిబట్టలతో ఆలయం చుట్టూ పొర్లుదండాలు పెట్టారు. జాతర ఏర్పాట్లను ఆలయ కమిటీ అధ్యక్షుడు కే.ప్రసాద్, కార్యదర్శి చంద్రశేఖర్‌పిళ్లై, ఉపాధ్యక్షుడు రంగనాథ మొదలియార్ పర్యవేక్షించారు.

పకడ్బందీగా ఏర్పాట్లు..

కార్వేటినగరం గంగజాతరను పురస్కరించుకుని యువత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మదన వేషకాలు చూపరులను అలరించింది. అదేవిధంగా అమ్మవారి ఆలయంతో పాటు, గ్రామ వీధులను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. మండల కేంద్రంలో మంగళవారం నుంచి బుధవారం వరకు రెండు రోజుల పాటు జరిగే జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకోవాలని బంగారమ్మ ఆలయ కమిటీకి సీఐ సత్యబాబు సూచించారు. మంగళవారం ఆయన అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులతో మాట్లాడుతూ మండల కేంద్రంలో పోలీసులను మఫ్టీలో నియమించినట్లు తెలిపారు. ప్రధాన కూడళ్లలో పోలీసులు బందోబస్తుల్లో ఉంటారన్నారు. ఆయన వెంట ఎస్ఐ దస్తగిరి, ఆలయ కమిటీ అధ్యక్షుడు ప్రసాద్, కార్యదర్శి చంద్రశేఖర్‌పిళ్లై, ఉపాధ్యక్షుడు రంగనాథ మొదలియార్ పాల్గొన్నారు.



పుర వీధుల్లో విహరిస్తున్న శ్రీబంగారమ్మ

విద్యుత్ అదాలత్‌లో సమస్యల పరిష్కారం



విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్న అధికారులు

పుత్తూరు: పట్టణంలోని విద్యుత్ డివిజన్ ఇంజినీర్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ప్రత్యేక విద్యుత్ అదాలత్‌లో మూడు ఫిర్యాదులను అప్పటికప్పుడు పరిష్కరించారు. పుత్తూరు డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారుల సమస్యల కోసం నిర్వహించిన విద్యుత్ అదాలత్‌లో నాలుగు ఫిర్యాదులు అందగా మూడింటిని పరిష్కరించారు. కార్యక్రమంలో విద్యుత్ అదాలత్ చైర్‌పర్సన్ వి.శ్రీనివాస ఆంజనేయమూర్తి, ఆర్థిక సభ్యులు కె.రామమోహన్‌రావు, స్వతంత్ర సభ్యులు జి.ఈశ్వరమ్మ, ఎస్సీ కృష్ణారెడ్డి పాల్గొన్నారు. డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.చిన్నరెడ్డప్ప, ఏఈ రవిచంద్రన్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

ఎయిడ్స్ నిర్మూలనపై అవగాహన



స్టాప్ ఎయిడ్స్ ఆకారంలో కూర్చున్న విద్యార్థులు

కార్వేటినగరం: యువతలో సరైన అవగాహన, చైతన్యం కల్పిస్తే ఎయిడ్స్ వ్యాధిని సమూలంగా నిర్మూలించడం సుసాధ్యమని డీఎం పురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం కేశవులు అన్నారు. మంగళవారం డీఎంపురం ఉన్నత పాఠశాల ఆవరణలో ఎయిడ్స్ నిర్మూలనపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రతి ఒక్కరూ ఎయిడ్స్ వ్యాప్తిపై సరైన అవగాహన కలిగి ఉంటే ఎయిడ్స్ వ్యాధిని సులభంగా నియంత్రించవచ్చన్నారు. అనంతరం జీవశాస్త్ర ఉపాధ్యాయుడు రాములు ఎయిడ్స్‌పై అవగాహన కోసం ఆడియో, వీడియో క్లిప్‌లను ప్రదర్శించారు. అలాగే విద్యార్థులచే ఏర్పాటు చేసిన స్టాప్ ఎయిడ్స్ అనే ఆంగ్ల అక్షరం చూపరులను ఎంతో ఆకట్టుకుంది. ఉపాధ్యాయులు ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పీహెచ్‌డీ ప్రదానం

పుత్తూరు: మండల పరిధిలోని వీఎస్ఎస్ పురం గ్రామానికి చెందిన ఎన్.రాజేశ్వరికి శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా విక్రమ సింహపురి యూనివర్సిటీ వారు పీహెచ్‌డీ ప్రదానం చేశారు. రిటైర్డ్ ప్రొఫెసర్ ఎం.చంద్రయ్య పర్యవేక్షణలో ''డెవలప్‌మెంట్ ఆఫ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అమాంగ్ ఎస్సీ ఎస్టీ విమెన్ ఇన్ చిత్తూరు డిస్ట్రిక్ట్ ఆఫ్ ఏపీ' అనే అంశంపై జరిపిన పరిశోధనకు ఆమెకు యూనివర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆర్.ప్రభాకర్ చేతుల మీదుగా పీహెచ్‌డీని ప్రదానం చేశారు.

ప్రజలతో స్నేహభావంతో మెలగాలి

- నేరాల నియంత్రణకు ప్రత్యేక దృష్టి సారించండి
- జిల్లా ఎస్పీ రిషాంత్‌రెడ్డి



పెనుమూరు పోలీస్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న చిత్తూరు జిల్లా ఎస్పీ రిషాంత్‌రెడ్డి

పెనుమూరు(కార్వేటినగరం) : న్యాయం కోసం పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రజలతో స్నేహభావంతో మెలగాలని, సమస్యను పరిష్కరించాలని జిల్లా ఎస్పీ రిషాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం వార్షిక తనిఖీలో భాగంగా ఆయన పెనుమూరు పోలీస్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఫిర్యాదుల కోసం వచ్చే వారితో స్నేహభావంతో మెలగి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని ఆదేశించారు. అదే విధంగా నేరగాళ్ల కదలికలపై ప్రత్యేక దృష్టి సారించి నేరాలను అదుపులో ఉంచాలన్నారు. అక్రమ మద్యం అమ్మకాలు, రవాణాలపై కూడా దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. పట్టణ కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ప్రత్యేక నిఘా పెట్టాలని, రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని నేరచరిత్ర కలిగిన వ్యక్తుల కదలికలు, శాంతి భద్రతకు విఘాతం కలిగించే వారి వివరాలను సేకరించాలన్నారు. మండలంలో కొత్తవ్యక్తుల కదలికలను విధిగా పసిగట్టాలని ఆదేశించారు. రాత్రివేళ చోరీలు జరగకుండా పట్రోలింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం స్టేషన్‌కు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఎస్పీ వెంట చిత్తూరు డీఎస్పీ శ్రీనివాసమూర్తి, ట్రైనీ డీఎస్పీ పావన్‌కుమార్, చిత్తూరు ఈస్టు సీఐ గంగిరెడ్డి, జిల్లా క్రైమ్ బ్రాంచ్ సీఐ సుబ్రమణ్యం, పెనుమూరు ఎస్ఐ అనిల్‌కుమార్, ఏఎస్ఐ ఉమామహేశ్వర్, సిబ్బంది ఉన్నారు.

ఆసక్తికరంగా గణిత అష్టావధానం



సమాధానం చెబుతున్న అష్టావధాని అరుణశివప్రసాద్

పుత్తూరు: పట్టణంలోని ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చిత్తూరుకు చెందిన గణిత అవధాని హెచ్.అరుణశివప్రసాద్‌చే నిర్వహించిన గణిత అష్టావధానం ఆసక్తికరంగా సాగింది. డిసెంబర్ 22న శ్రీనివాస రామానుజం జయంతిని పురస్కరించుకుని ముందస్తుగా మంగళవారం కళాశాలలో గణిత అష్టావధాన కార్యక్రమం నిర్వహించారు. ఈ అవధాన కార్యక్రమంలో 8 మంది డిగ్రీ విద్యార్థులు పృచ్ఛకులుగా వ్యవహరించారు. నిషిద్ధ సంఖ్య, క్యాలెండర్, క్యూబ్, పైవిలువ, ఒకటిని ప్రధాన సంఖ్యతో భాగించడం వంటి గణిత సమస్యలకు అవధాని సెకన్ల వ్యవధిలో సమాధానం చెబుతూ అందరిలో ఆసక్తిని రేకెత్తించారు. విద్యార్థులు సంధించిన గణిత శాస్త్ర చిక్కుముడులను చిటికెలో పరిష్కరించి అందరినీ ఆశ్చర్యపరిచారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ అవధానం అంటే ఏకాగ్రత అని తెలిపారు. గణిత శాస్త్ర అవధానం ద్వారా విద్యార్థులకు గణితం పట్ల ఆసక్తితో పాటు సామర్థ్యం పెరుగుతుందని తెలిపారు. అనంతరం అవధాని అరుణశివప్రసాద్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గణిత శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ పి.గాయత్రి, అధ్యాపకులు నరసింహారెడ్డి, వసంత్, వాణిశ్రీ, సుజన, నరసింహులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధికి కృషి చేయండి



సంక్షేమ పథకాలను వివరిస్తున్న అధికారులు

శ్రీరంగరాజపురం : ప్రతి ఒక్కరూ దేశ అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీడీఓ కృష్ణయ్య అన్నారు. మంగళవారం మండలంలోని తయ్యూరు, మెదవాడ పంచాయతీల్లో వికసిత భారత సంకల్ప యాత్ర నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదల ఆరోగ్యం కోసం ప్రాధాన్యత ఇస్తున్నాయని తెలిపారు. అలాగే ఆయుష్మాన్ పథకాన్ని ప్రవేశపెట్టి ఏడాదికి కేంద్రం రూ.5 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.2 లక్షల వరకు మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే కేంద్రం పీఎం కిసాన్, ఉపాధిహామీ, జలజీవన్ మిషన్, విశ్వకర్మ వంటి పథకాలు, రాష్ట్ర ప్రభుత్వం అమ్మఒడి, రైతు భరోసా, చేయూత, విద్యాదీవెన, పేదలకు ఇంటి పట్టాలు వంటి ఎన్నో పథకాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 18 రకాల సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నాయని తెలిపారు. అనంతరం పాఠశాల విద్యార్థులు ఆటపాటలతో ప్రజలను అలరించారు. కార్యక్రమానికి సర్పంచులు వరదమ్మ, ఉమామహేశ్వరి, ఎంఈఓ డాక్టర్ బాలసుబ్రమణ్యంరెడ్డి, గౌరి, ఏఈ శ్రీధర్, ఏపీఓ చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి జ్యోత్స్న, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేటి విద్యార్థులే రేపటి శాస్త్రవేత్తలు



సైన్స్ ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న ఎంఈఓలు



నమూనాలను పరిశీలిస్తున్న ఎంఈఓలు

గంగాధర నెల్లూరు: నేటి విద్యార్థులే రేపటి శాస్త్రవేత్తలని మండల విద్యాధికారులు ఆంజనేయులు శెట్టి, గుణశేఖర్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం మండల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌ను హెచ్ఎం హేమలతతో కలిసి వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ పోటీల్లో ప్రథమ స్థానం వచ్చిన వారిని జిల్లాస్థాయికి, ఆపై రాష్ట్రస్థాయికి పంపిస్తామన్నారు. విద్యార్థులు తీసుకువచ్చిన వివిధ కేటగిరీలకు సంబంధించిన నమూనాలను పరిశీలించారు. గ్రూపు సభ్యుల కేటగిరీలో రాజశేఖర్, యశ్వంత్ కుమార్ ప్రథమ స్థానంలో నిలువగా, టెన్త్ విద్యార్థిని పద్మప్రియ సింగిల్ కేటగిరీలో మొదటి స్థానంలో నిలిచిందన్నారు. వీరిని త్వరలో జిల్లాస్థాయి పోటీలకు తీసుకువెళ్తామన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్ఎం దినకరన్, నోడల్ హెచ్ఎం అశోక్ బాబు పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథం అలవాటు చేసుకోండి

నగరి : విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం అలవాటు చేసుకోవాలని ఎంఈఓ శ్రీదేవి అన్నారు. మంగళవారం స్థానిక పీసీఎన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఆమె వీక్షించారు. విద్యార్థుల ప్రదర్శనలు అలరించాయి. వ్యక్తిగత ప్రయోగాలలో విజేతలుగా బాలయ్య, గోకుల్, సతీష్ ఎంపిక కాగా, గ్రూప్ ప్రయోగాలలో పీసీఎన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, చింతలపట్టెడ జెడ్పీహెచ్ఎస్, తడుకుపేట జెడ్పీహెచ్ఎస్, ఉపాధ్యాయ ప్రయోగాల్లో సంపూర్ణ, ఎస్.వెంకటేశ్వరులు, నీరజ విజేతలుగా ఎంపికయ్యారు. వారికి బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు.

విద్యార్థుల ప్రతిభ

పెనుమూరు(కార్వేటినగరం): నేటి విద్యార్థులే రేపటి శాస్త్రవేతలని ఎంఈఓ రంగనాథరెడ్డి అన్నారు. మంగళవారం పెనుమూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఇందులో ప్రతిభ చూపిన ఎల్కేపీఊరు ఉన్నతపాఠశాలకు చెందిన సతీష్‌సాయి, ఉగ్రాణపల్లి హైస్కూల్ విద్యార్థి దామన్, పెనుమూరు హైస్కూల్ విద్యార్థి అనీషా జిల్లాస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. వారిని అభినందించి ప్రశంసాపత్రాలను అందించారు.

ఆకట్టుకున్న సైన్స్ ఎగ్జిబిషన్

నింద్ర: స్థానిక స్కూల్‌లో వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించినట్లు ఎంఈఓ శ్రీధర్ రాజు తెలిపారు. ఈ పోటీల్లో మొదటి స్థానంలో నిలిచిన వారు ఈ నెల 22వ తేదీన చిత్తూరులో జరిగే జిల్లాస్థాయి పోటీలకు హాజరు కావాలన్నారు. మండలస్థాయి పోటీల్లో ఉపాధ్యాయ స్థాయిలో అపరంజి రాజు (అరూరు) గ్రూప్‌స్థాయిలో సాయి, శివ ప్రకాష్, ఇమ్మాన్యుయేల్, (అత్తూరు) వ్యక్తిగత స్థాయిలో మహిమ(చవరంబాకం) విజేతలుగా నిలిచినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ వసుమతిదేవి, హెచ్ఎం శివయ్య పాల్గొన్నారు.





పెనుమూరు: సైన్స్ ఎగ్జిబిషన్‌ను సందర్శిస్తున్న ఎంఈఓ రంగనాథరెడ్డి, నింద్రలో..

పియానో వితరణ



కళాకారుడికి పియానో అందిస్తున్న మంత్రి రోజా

నగరి : సంగీత వాయిద్య కళాకారుడు నారాయణకు మంత్రి ఆర్‌కే రోజా పియానో అందజేశారు. కడప జిల్లా నబికోటకు చెందిన కె.నారాయణ పియానోతో సంగీత పాఠాలు నేర్పుతూ జీవనోపాధి పొందేవాడు. ఇటీవల అతని వద్ద ఉన్న పియానో మరమ్మతులకు గురికావడంతో కుటుంబపోషణ ఇబ్బందిగా మారింది. కొత్త పియానో కొనుగోలు చేయడానికి ఆర్థిక స్థోమత లేకపోవడంతో డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా ద్వారా మంత్రి రోజాను కలిసి, తన పరిస్థితిని ఆమెకు వివరించాడు. మంగళవారం ఆమె నగరిలోని తన స్వగృహానికి నారాయణను పిలిపించి కొత్త పియానోను అందించారు. ఈ సందర్భంగా మంత్రి రోజాకు కళాకారుడు నారాయణ కృతజ్ఞతలు తెలిపాడు.

శ్రీకాళహస్తి వెళ్తుండగా..





క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తున్న సిబ్బంది

తొట్టంబేడు (శ్రీకాళహస్తి): రెండు వాహనాలు ఢీకొన్న ఘటనలో ఐదుగురు వ్యక్తులు గాయపడిన నాయుడుపేట–పూతలపట్టు ప్రధాన రహదారిలోని లింగమనాయుడుపల్లి సమీపంలో సోమవారం రాత్రి జరిగింది. తొట్టంబేడు ఎస్ఐ రాఘవేంద్ర కథనం మేరకు.. తెలంగాణ రాష్ట్రం నల్గొండ జిల్లా దేవరకొండకు చెందిన సైదులు(36) సాక్షి రిపోర్టర్‌గా పని చేస్తున్నాడు. ఇతను కుటుంబ సభ్యులతో కలిసి శ్రీకాళహస్తీశ్వర స్వామివారి దర్శనానికి శ్రీకాళహస్తి వస్తుండగా లింగమనాయుడుపల్లి సమీపానికి చేరుకోగానే ఎదురుగా వేగంగా వెళ్తున్న ఓ లారీ వీరి క్వాలిస్ వాహనాన్ని ఢీకొని ఆపకుండా వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో క్వాలిస్ వాహనం కొంత భాగం ధ్వంసం కాగా అందులో ఉన్న భార్గవి(28) అనే మహిళ తీవ్రంగా గాయపడింది. డ్రైవర్ సహా మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన సైదులు, భార్గవిని చికిత్స నిమిత్తం తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.